క్లుప్తంగా

లారీ నిలిపివేతతో ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట- పిఠాపురం రోడ్డులో అడ్డంగా నిలిపిన లారీ

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సిమెంటు లారీని రోడ్డుకు అడ్డంగా నిలిపేయడంతో మంగళవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఓ సిమెంట్ వ్యాపారి కంపెనీ నుంచి వచ్చిన సిమెంట్‌ను అన్‌లోడ్ చేయడానికి లారీని రోడ్డుకు అడ్డుగా నిలిపేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నేటి నుంచి నీలమ్మ తల్లి జాతర



సామర్లకోటలో వేంచేసి ఉన్న నీలమ్మ తల్లి

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటి కోసం సుమారు 130 ఏళ్ల క్రితం పట్టణ ముఖ్యకూడలి ప్రదేశంలో చెరువు తవ్వుతున్న సమయంలో చిన్న రాతి విగ్రహం బయట పడింది. ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో చెరువుకు నీలమ్మ చెరువుగా పేరు వచ్చింది. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి రోజూ ధూపదీప నైవేద్యాలు సమర్పించడంతో పాటు ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జాతరలో సిరి బొమ్మ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఉత్సవాల కోసం నీలమ్మ తల్లి ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

చిన్నతనం నుంచే భాషా పరిజ్ఞానం అవసరం



విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న ఉపాధ్యాయులు

పెద్దాపురం: విద్యార్థులు చిన్నతనం నుంచే తెలుగు భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు తారుమారై..!

- సిటీలో టీడీపీ విజయం
- ఎమ్మెల్యేగా వనమాడి గెలుపు

కాకినాడ: సార్వత్రిక ఎన్నికల పోరులో విజయం టీడీపీని వరించింది.. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో అంచనాలకు భిన్నంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విజయం సాధించారు. మొత్తం 17 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి 55,597 ఓట్లు రాగా, కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు 1,11,068 ఓట్లు దక్కించుకుని 55,478 ఓట్లతో గెలుపొందారు. అలాగే ఇతర స్వతంత్ర అభ్యర్థులకు మూడెంకెల ఓట్లు వచ్చాయి. నోటాకు మాత్రం 1,419 మంది ఓటు వేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 14 టేబుల్స్‌పై 17 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ పర్యవేక్షణలో సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర అధికారులు కౌంటింగ్‌ను పర్యవేక్షించారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఈ క్రమంలో జేఎన్‌టీయూకే పరిసరాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 600 మీటర్లలో పరిసరాలను దిగ్బంధం చేసి కేవలం అనుమతి కలిగిన వారికి మాత్రమే ప్రవేశం కల్పించారు. పోలింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బంది బ్రీత్ ఎనలైజర్ టెస్టులు కూడా చేశారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించారు. గతానికన్నా భిన్నంగా మీడియా సెంటర్ నుంచి పరిమిత సంఖ్యలో మాత్రమే సమాచార శాఖాధికారులు కౌంటింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లారు. కౌంటింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా మాత్రమే అందించేలా అక్కడ ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సెంటర్ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయగలిగారు. మరోవైపు కౌంటింగ్ నేపథ్యంలో నగరంలోని దాదాపు అన్ని ముఖ్య ప్రాంతాల్లో దుకాణాలను బంద్ చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా సెలవు ప్రకటించడంతో ఉదయం నుంచి ప్రధాన కూడళ్లలో నిర్మానుష్య వాతావరణం కనిపించింది.



వనమాడి కొండబాబుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్వో వెంకటరావు

ఫలితంపై ఉత్కంఠ

ఎన్నికల ఫలితంపై ఆరంభం నుంచి వివిధ రాజకీయ పార్టీల కేడర్‌తోపాటు ప్రజలు కూడా ఉత్కంఠగా ఎదురుచూశారు. అంచనాలకు అందని విధంగా టీడీపీ అభ్యర్థి వనమాడి కొండబాబు విజయం సాధించారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో కూటమి నేతలు పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చేసిన దుష్ప్రచారం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఎల్లో మీడియా ద్వారా సాగించిన తప్పుడు ప్రచారాలు, ఇలా అనేక అంశాలు టీడీపీ విజయానికి దోహదం చేశాయని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)కు ఆర్వో జె.వెంకటరావు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



ఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రూరల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన నానాజీ

రూరల్‌లో 'పంతం' గెలుపు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోరులో తుది ఫలితాలు వెల్లడయ్యాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) 72,040 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాకినాడ జేఎన్‌టీయూకే మెకానికల్ పీజీ బ్లాక్‌లో మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో నానాజీ ప్రతి రౌండ్‌లో ఆధిపత్యం కనబరిచారు. మే 13న జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీల మధ్య పోరు జరిగింది. వైఎస్సార్ సీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జనసేన నుంచి పంతం నానాజీ హోరాహోరీగా తలపడ్డారు. ఎన్నికల ఫలితాల ప్రకారం మొత్తం 2,06439 ఓట్లు పోలవ్వగా జనసేన నుంచి విజయం సాధించిన పంతం నానాజీకి 1,34,414 ఓట్లు లభించాయి. కన్నబాబుకు 62,374 ఓట్లు పడ్డాయి. మొత్తం 15 మంది అభ్యర్థుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరు మినహా మిలిగిన 13 మందికి డిపాజిట్లు దక్కలేదు. నోటా కింద మొత్తం 1,783 ఓట్లు నమోదయ్యాయి. ఎన్నికల ఫలితాలపై నానాజీ మీడియాతో మాట్లాడుతూ తనకు మెజార్టీని అందించిన ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు.

అభ్యర్థులు	పోలైన ఓట్లు
కురసాల కన్నబాబు	62,374
పిల్లి సత్యలక్ష్మి	2205
సాధనాల రాజు	312
కొరమాటి మహర్షి	223
దడాల బాబ్జీ	310
పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)	1,34,414
పట్నాల వెంకటేశ్వరరావు	480
పలివెల స్వరూప్	347
మేశం వీరాస్వామి	2,365
అన్నవరం పితాని	675
అన్యం విశ్వేశ్వరరావు	172
కర్రి గోపాలకృష్ణ	234
దాగంటి సూర్యనారాయణమూర్తి	161
మాదిపల్లి రాజు	149
వెలుబంట్ల వీరభద్రరావు	235
నోటా	1,783

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలు తొలగించారు. డ్రైన్లలో పూడిక తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీరబాబు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. స్థానికంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ఉగ్గిరాల వీరబాబు డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గెలిచినా, ఓడినా ప్రజలతోనే ప్రయాణం

గోకవరం: గెలుపోటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం ప్రజలతోనే అని జగ్గంపేట స్వతంత్ర అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మద్యం, డబ్బు పంచకపోయినా ప్రజలు నాపై నమ్మకంతో 12,351 ఓట్లు వేశారన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని, సమస్యలపై పోరాటం ఆగదన్నారు.

పచ్చదనం పెంపు.. చైతన్యం నింపు

- జేఎన్‌టీయూకేలో వినూత్న ప్రయోగం
- మినీ ఫారెస్ట్, జంగిల్ బుక్ ఏర్పాటు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

బాలాజీచెరువు: పర్యావరణ హితం అందరి అభిమతం కావాలి.. ఈ నినాదం చైతన్యం నింపాలి.. పచ్చదనం పెంచేలా, ప్రతి ఒక్కరూ ఆచరించేలా జేఎన్‌టీయూకే ముందుకు సాగుస్తోంది.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పాఠ్యాంశాల్లో బోధనే కాకుండా వాటిని క్షేత్ర స్థాయిలో ఆచరించే విధంగా జేఎన్‌టీయూ యంత్రాంగం కృషి చేస్తుంది. జగనన్న హరిత నగరాలు పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, ఈ బాటలో యూనివర్సిటీ పయనిస్తుంది. కాకినాడ నగర నడిమధ్యలో ఉన్న జేఎన్‌టీయూ వర్సిటీ దాదాపు 70 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో సగం వరకూ ఖాళీస్థలం ఉంది. ఈ ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం నింపాలని వర్సిటీ భావించింది. రహదాలకు ఇరువైపులా పచ్చదనంతో పాటు ఖాళీ ప్రాంతాల్లో వివిధ జాతులకు చెందిన మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గత ఏడాది జూన్‌లో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో అవుట్ స్టాండింగ్ ఫెర్మార్మెన్స్ సర్టిఫికెట్ సాధించింది. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌కు సంబంధించి 2021–22కు గాను ఆడిటింగ్‌లో గ్రీన్ క్యాంపస్ ఎకో స్కోర్ 53 శాతం పొందింది. ఈ ఏడాదికి 65 శాతం సాధించేలా కృషి చేస్తుంది. ఎనర్జీ సీవరేజ్ (వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్), కార్బన్ క్రెడిట్స్ (కార్బన్ ఉదారాలు) గ్రీన్ బిల్డింగ్, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్, టెర్రస్ ఫార్మింగ్, కంపోస్టింగ్ వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని స్కోర్ విడుదల చేశారు. నేషనల్ అక్రిడేషన్ బోర్డు లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో సర్వే చేసి ర్యాంక్ విడుదల చేస్తారు.



చెట్ల కింద జంగిల్‌బుక్ పేరుతో విద్యా బోధన

మొక్కలు నాటి.. సంరక్షించి

జపాన్‌కు చెందిన వ్యక్తి రూపొందించిన మియావాకీ (మినీ ఫారెస్ట్) ప్లాంటేషన్ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రంథాలయం పక్కన 2020 సంవత్సరంలో 2,020 మొక్కలను ఆరెకరానికి పైగా స్థలంలో అన్ని రకాల మొక్కలు నాటి దాని మినీ ఫారెస్ట్‌గా రూపొందించారు. ఇది ఆహ్లాదాన్ని పంచుతోంది. ఎంత ఉష్ణోగ్రత ఉన్నా ఈ ఫారెస్ట్ కాస్త వరకూ చల్లగా ఉంటుంది.



వర్సిటీలో గ్రంథాలయం పక్కన ఏర్పాటు చేసిన మియావాకీ ప్లాంటేషన్

జంగిల్ బుక్ పేరుతో..

పూర్వ గురుకుల పాఠశాల తరహాలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ బిల్డింగ్ వద్ద జంగిల్ బుక్ పేరుతో వృక్షాల మధ్య విద్యార్థులకు తరగతులు బోధించే విధానం తీసుకు వచ్చారు. పచ్చని వాతావరణం మధ్య చెట్ల కింద బల్లలపై కూర్చుని పాఠాలు వినే విధంగా రూపొందించారు. పై రెండు సరికొత్త ప్రాజెక్టులు అప్పుడు వర్సిటీ గ్రీన్ ఇన్షియేటివ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం డీఏపీగా ఉన్న ప్రొఫెసర్ మురళీకృష్ణ రూపొందించి క్యాంపస్ పచ్చదనంతో ఉండే విధంగా కృషి చేస్తున్నారు.

ఆరోగ్యకర వాతావరణం లక్ష్యం



వర్సిటీని కాలుష్య రహితంగా తీర్చిదిద్ది ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలనేది నా లక్ష్యం. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించినప్పుడే సార్థకత ఉంటుంది. ముఖ్యంగా ఇప్పటి వరకూ ఎవరూ చేయని విధంగా వర్సిటీతోపాటు అనుబంధ కళాశాలలో 75 సంవత్సరాలు పైబడి ఉన్న వృక్షాల నిర్వహణకు ఏడాదికి రూ.2,500 పింఛన్ ప్రకటించాను. పచ్చదనం నింపే విధంగా అవసరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నాం. క్యాంపస్‌లో పరిశుభ్రత, మొక్కలు సంరక్షణపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

–డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

నగరంలో కర్ఫ్యూ వాతావరణం



జన సంచారం లేక వెలవెలబోయిన ఎల్‌జీ నగర్ ప్రధాన రహదారి

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో మంగళవారం కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఉదయం 8 నుంచి ప్రజలు టీవీలకు అతుక్కుపోవడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏ రోడ్డులో చూసినా జనం సంచారం లేకపోవడంతో వెలవెలపోయాయి. స్థానిక జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అటువైపు వెళ్లేందుకు పోలీసులు కొన్ని ఆంక్షలు విధించారు. దీంతో ఆయా రోడ్లలో జనసంచారమే లేదు. మిగిలిన రహదారులు సైతం బోసిపోయాయి. సాయంత్రం 4 గంటల తర్వాత ఫలితాలు దాదాపు తెలియడంతో కాస్త రద్దీ కనిపించింది.

తీరంలో తెగిన రక్షణ వలయం

- ప్రమాదకరంగా ఉప్పాడ తీరం
- సాగర గర్భంలో కలిసిపోతున్న గృహాలు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు నిర్మించిన జియో ట్యూబ్ (రక్షణగోడ) తాడు తెగి సముద్ర గర్భంలో కలిసి పోవడంతో తీర ప్రాంతానికి రక్షణ కరవైంది. దీంతో ఉప్పాడ తీర ప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఎన్నో భారీ తుపాన్లు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఈ రక్షణ గోడ ఎదుర్కొంది. అయితే ఈ గోడ నిర్మాణం జరిగినప్పటి నుంచి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో అది కాస్తా సముద్రం పాలైంది.



సముద్ర కోతకు గురైన మత్స్యకార గృహాలు

ఆదుకున్న మహానేత

ఉప్పాడలో ఏటా రెండు నుంచి మూడు తుపాన్ల చొప్పున ఇప్పటివరకూ సుమారు 120కి పైగానే తుపాన్లను చూసినట్లు గ్రామంలోని మత్స్యకార పెద్దలు చెబుతున్నారు. గతంలో ఈ తీర ప్రాంతంలో 3 ట్రావెల్ బంగళాలు, 2 పొగాకు బీడు కేంద్రాలు, సుమారు 200 ఎకరాలకు పైగా సరుగుడు తోటలు, 1000కి పైగా గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయని మత్స్యకారులంటున్నారు. ఉప్పాడ తీరప్రాంతం కిలోమీటర్ల మేర కోతకు గురవ్వడం, రూ.కోట్ల ఆస్తులు, విలువైన భూములు, ప్రభుత్వ భవనాలను కడలి మింగేసింది. ఇప్పటికే ఉప్పాడలో మూడొంతుల ప్రాంతం సముద్రం పాలైంది. తుపాన్లు వచ్చినప్పుడల్లా తీవ్రమైన కోతకు గురికావడం, అధికారులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ఎంఎం పళ్లంరాజు చొరవతో సుమారు రూ.12 కోట్లు వెచ్చించి ఉప్పాడ తీర ప్రాంతంలో సుమరు రెండు కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మించారు. హుద్‌హుద్‌తో సహా అనేక తుపాన్ల నుంచి ఉప్పాడ తీర ప్రాంతం కోతకు గురి కాకుండా ఈ రక్షణగోడ రక్షణగా నిలిచింది. ఇప్పటి వరకూ తీర ప్రాంత ప్రజలతో పాటు వారి ఆస్తులను కాపాడగలిగింది. అయితే జియో ట్యూబ్ టెక్నాలజీతో నిర్మించిన రక్షణ గోడ గత కొంతకాలంగా సాగర గర్భంలో కలిసి పోయింది. గోడ నిర్మాణానికి ఉపయోగించిన నైలాన్ తాడు తెగిపోతూ రాళ్లు చెల్లాచెదురై తీర ప్రాంతం కోతకు గురైంది. తీర ప్రాంతం రక్షణకు శాశ్వత పరిష్కారం చేపట్టకపోతే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



జియో ట్యూబ్ తెగి కోతకు గురైన తీరం

విజ్ఞానం తెరుచుకునేదెప్పుడో..!

- 15 ఏళ్లుగా కలగా మ్యూజియం
- నెరవేరని దాత ఆశయం

సామర్లకోట: నియోజకవర్గంలోని పెద్దాపురం ముఖ్య కూడలిలో కొన్నేళ్లుగా మ్యూజియం తెరుచుకోవడం లేదు.. ప్రజలకు విజ్ఞానం, వినోదం అందించే దీని నిర్వహణపై శీతకన్ను పడింది. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పార్కులో మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపాలిటీ స్థలం కేటాయించడంతో బచ్చు ఫౌండేషన్ అధినేతలు ముందుకు వచ్చి సుమారు రూ. కోటితో 2009లో భవన నిర్మించారు. ఈ భవనాన్ని అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ప్రారంభించారు. ఈ మ్యూజియంలో జిల్లాతో పాటు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక పరికరాలు ఉంచాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ మ్యూజియంపై శ్రద్ధ చూపిన దాఖలాలు కనిపించడం లేదు. మ్యూజియం ప్రారంభించి పర్యాటక పురావస్తు శాఖ అధికారులకు అప్పగించగా, వారి నిర్లక్ష్యం కారణంగానే ప్రజలకు అందుబాటులోకి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వివిధ అంశాలకు నిలయంగా..

ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, రాజులకు చెందిన విషయాలు, రాజకీయ అంశాలు, పురావస్తు శాఖకు సంబంధించిన అనేక చిత్రపటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. దీంతో పాటు ఆయా రాష్ట్రాలలో ఉన్న ప్రసిద్ధి. ఆ రాష్ట్రాలు చేరుకోవడానికి రూట్ మ్యాప్‌లను కూడా రూపొందించి ప్రజలు సులభంగా ఆయా క్షేత్రాలను దర్శించుకునే విధంగా చూడాలని భావించారు. అయితే పెద్దాపురం మున్సిపాలిటీ, పురావస్తు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ఇది అక్కరకు రావడం లేదు.



పెద్దాపురం మున్సిపల్ పార్కులో మ్యూజియానికి చెందిన భవనం

వినియోగంలోకి వస్తే మంచిది

మ్యూజియంలో ప్రతి జాతీయ నాయకునికి సంబంధించిన జీవిత చరిత్రతో పాటు ఆయా పురాతన కట్టడాలు, వాటి నిర్మాణ అంశాల చరిత్రతో కూడిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని భావించారు. ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు విజ్ఞానంతో పాటు వినోదం కలుగుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే వారి ఆనందం కలగానే మిగిలిపోయింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉన్న షారికల్ మ్యూజియాన్ని తెరిపించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీపైనే ఉంది. ఈ భవనం నిర్మించిన స్థలంలో మున్సిపల్ పార్కు ఉండటంతో ప్రస్తుత వేసవిలో ఉదయం, సాయంత్రం అనేక మంది పార్కులో కాలక్షేపం చేస్తున్నారు. ఈ పార్కు సమీపంలోనే పెద్దాపురం గ్రంథాలయం ఉండటంలో గ్రంథాలయానికి వచ్చిన వృద్ధులు, ఆ పార్కులో విశ్రాంతి తీసుకొంటున్నారు. మ్యూజియం వినియోగంలోకి తీసుకు వస్తే భావితరాలకు విజ్ఞానదాయకంగా ఉంటుంది.

నిప్పుల కొలిమి



నిర్మానుష్యంగా పెద్దాపురం-సామర్లకోట ప్రధాన రహదారి

పెద్దాపురం: భానుడు నిప్పుల కొలిమిలా మారాడు.. భగభగమంటూ సెగలు పుట్టించాడు.. ఎండతో పాటు వడగాడ్పునకు పెద్దాపురం నియోజకవర్గంలో మంగళవారం ప్రజలు అల్లాడిపోయారు. ఒకపక్క ఎన్నికల కౌంటింగ్ నిబంధనలు, మరోపక్క ప్రచండ భానుడి ధాటికి మూడు రోజుల రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వడగాడ్పుల ప్రభావం మరింత తీవ్రమైంది. మధ్యాహ్నమైతే చాలు రోడ్లు జనజీవనం లేక ఖాళీగా మారాయి. రోజురోజుకూ వేడిగాలులు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్తే ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 11 గంటలు దాటితే ఎండ తీవ్రత అధికం కావడంతో పాట్లు అన్నీ ఇన్నీ కావు. పెద్దాపురంలో 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో జనం బెంబేలెతుత్తున్నారు. అసలే ఉక్కబోతతో ఇబ్బందులు పడుతుంటే పట్టణ, మండలంలోని గ్రామాల్లో తరచూ విద్యుత్ కోతలతో విలవిల్లాడుతున్నారు. ఇంకెంత కాలం ఈ ఎండలు భరించాలో అని విస్తుపోతున్నారు.